# తీరిన కోరిక

సి.హెచ్.కామేశ్వరి

"చెప్పు జానకీ!" నీ కోరికేమిటో! మరింత లాలనగా అడిగాడు శ్రీధర్ జానకిని మరోసారి సుతారంగా చెంపని ముద్దాడుతూ.

జానకి తల వంచుకుని సిగ్గుగా నవ్వుకొంటోంది. కాని మనసులోని మాట పైకి చెప్పలేకపోతోంది.

"ఎలా చెప్తుంది?" అసలే కొత్త పెళ్లికూతురు మధురానుభూతులు అందించిన మగడి సాన్నిహిత్యం గుండెల్లో గిలిగింతను శరీరానికి చెమరింతని కలిగిస్తోంది. తొలిరాత్రి వరకు పదిలపరిచిన అందాన్ని పవిత్రమైన కన్యాత్వాన్ని భర్తపరం చేసిన ఆ నూతన వధువు మనశ్శరీరాలు గాల్లో తేలుతున్నంత పరవశాన్ని కలిగిస్తున్నాయి.

జానకికి తొట్రుపాటుగా వుంది. తనకి ఇంతవరకు తల్లిదండ్రుల వల్ల తీరని కోరికలు ఏమైనా వుంటే చెప్పమంటున్న భర్త మంచితనం ఆమెకి.... మునిగి తేలుతున్న భావాన్ని కలుగజేస్తోంది.

"కన్నవారివల్ల తీరని కోరికలు కట్టుకున్నవాడు తీరిస్తే ఆ భార్యకి జీవితాంతం ఒక తీపిగుర్తుగా మిగిలిపోతుంది" అని శ్రీధర్‌కి శ్రీధర్ ఫ్రెండ్ చెప్పాడుట.

అందుకే ఇందాకటినుండి బతిమాలుతున్నాడు శ్రీధర్ జానకి కోరిక ఏమిటో చెప్పమనీ.

కాని, 'ఎలా చెప్పాలి?' తన కోరిక వింటే నవ్వుతాడో... చిరాకు పడతాడో... అని భయంగా వుంది జానకికి.

అసలు తన కోరికని తనని కన్నవారే ఆమోదించలేదు. ఇంక తన భర్త మాత్రం ఏం ఆమోదిస్తాడు? అనుకుంది జానకి.

అసలు జానకి కోరిక ఏమిటంటే హాలీవుడ్ తార గ్రేట్ బార్బైట్లాలాగా మోడల్ గర్ల్ పెర్సిస్ కంబట్టాలాగా గుండు చేయించుకోవాలని, చక్కగా మోడ్రన్ డ్రస్సులు వేసుకోవాలని, అందరి దృష్టిలో విభిన్నమైన తన టేస్ట్‌కి గుర్తింపు రావాలని కోరిక. పోష్‌గా తిరగాలని, తర్వాత క్రాఫ్ వచ్చాక ఫాంట్, షర్ట్స్ వేసుకుని మగాడిలాగా కొన్నాళ్ల తిరగాలని, ఆ తర్వాత బాబ్డ్ హెయిర్‌తో ఫాన్సీగా వుండాలని, చక్కగా స్లీవ్‌లెస్ జాకెట్లు, పంజాబీ డ్రెస్‌తో మోజుతీరా తిరిగాక ఆ తరువాత అచ్చమైన ఆంధ్రా అమ్మాయిలాగా మిగిలిపోవాలని మహా ఉబలాటం తనకి. ఆ గెటప్స్ అన్నింటిలో ఒక స్పెషల్ ఆల్బమ్ తయారుచేయించి దాచుకోవాలని మహా కోరిక తనకి.


తన వృద్ధాప్యంలో తనకి తీపి గుర్తుగా మిగలాలన్న తన కోరిక సంగతి తెలియగానే అమ్మ తనమీద విరుచుకుపడింది. 'నీకేం వచ్చిందే! ఇటువంటి పాడుబుద్ధులు పుడుతున్నాయి. అసలు అంత అందమైన తలకట్టుని నాశనం చేసుకుంటానని అనడానికి నోరెలా వచ్చింది. అసలు శిరోముండనం ఎవరు చేయించుకుంటారో తెలుసా?" అని దుమ్మెత్తిపోసింది. సెంటిమెంటల్‌గా అన్నయ్యలు, వదినలు, అక్కలు, బావలు అందరూ తన కోరిక తెల్సి ముందు నవ్వడం, ఆపైన తిట్టడం, తర్వాత లెక్చర్స్ ఇవ్వడం నాన్నగారికి భయమేసినట్లుంది. ఏదో ఒక క్షణాన ఏ బ్యూటీ పార్లర్‌లోనో చేయించుకు వచ్చేస్తుందని. అందుకే తనమీద ప్రమాణం చేయించుకున్నారు అటువంటి పనులు చేయవద్దని.

దాంతో తన కోరిక సంగతే మర్చిపోయింది.

ఇప్పుడు పనిమాలా భర్త గుర్తుచేశాడు. 'ఎలా చెప్పాలి! అనుకుని తటపటాయించి, ఎలాగో కష్టపడి తన కోరిక ఏమిటో చెప్పింది జానకి.

జానకి కోరిక విన్న శ్రీధర్ ముందు విస్తుపోయాడు. ఆపైన పకాలున నవ్వాడు ఆ తర్వాత కొంచెం దిగులుగా "అన్యాయం జానకీ! ఏదైనా కోరిక కోరుకోమంటే ఇటువంటి కోరికా నీవు కోరేది. ఏదైనా ఊరు చూడాలనో, ఏదైనా కొనాలనో అంటే నిమిషంలో ఎగిరి గంతేసి తీర్చేవాణ్ణి. అటువంటిది గుండు చేయించుకుంటాననడం భావ్యమేనా! అసలు నీ అందమైన జడ చూసే నిన్ను పెళ్లి చేసుకున్నాను. నీ తలలోని పూల సువాసనలు ఆఘ్రాణిస్తూ రొమాన్స్ చేయడం గురించి ఎంతగా ఆలోచించానో నీకు తెలియదు. మావాళ్లందరూ కూడా నీ జడకి ప్లస్ మార్కులు వేశారు" అని ఇంకా ఏదో చెప్తున్న శ్రీధర్ మాటలకి అడ్డొచ్చింది జానకి.

"సర్లెండి అర్థమయింది మీరుకూడా నా కోరిక



తీర్చలేరు. తీర్చరు. అంతేగా!'' జానకి మోము చిన్నబోయింది.

అదిచూసి శ్రీధర్ కంగారుపడిపోయి ''అదికాదు జానీ! పోనీ ఒక పనిచేద్దాం. ఓ ఏడాదివరకు నా ఆనందాన్ని నన్ను పొందనీ! ఆ తర్వాత ఏదో కారణం చెప్పి నీ కోరిక నేను తీరుస్తాను. ఏమంటావు?'' అనడిగాడు జానకిని.

ఈమాట జానకికి నచ్చింది. సరేనన్నట్లు తలూపింది.

వచ్చే ఏడాది తీరబోయే తన చిరకాలవాంఛని తలచుకుంటూ ఆనందంగా భర్త కౌగిలిలో ఒరిగిపోయింది. పాపం శ్రీధర్‌కి మాత్రం గుండె బరువెక్కింది జానకి జడని చూసి.

జానకి పెళ్లయి ఆరు నెలలు పూర్తయింది. ప్రతిరాత్రి వసంతరాత్రిగా గడుపుతున్న ఆ నూతన దంపతులకి రోజులు ఎలా గడుస్తున్నాయో తెలీడం లేదు.

కానీ మధ్యమధ్యలో తన గుండు ప్రస్తావన తెచ్చినప్పుడల్లా శ్రీధర్ మూడ్ పాడయిపోతోంది. ''ఆరోజు అలా ఎందుకు మాట ఇచ్చానా?'' అని పశ్చాత్తాప పడుతున్నాడు.

ఇంట్లో అందరూ జానకి ఒత్తయిన బారైన జడని చూసి ఎంతో ముచ్చట పడుతున్నారు. అటువంటప్పుడు జానకి ఇలా గుండు చేయించుకుంటే ఎలా?'' సరే గుండు అంటే ఏదో మొక్కు తప్పలేదు అని చెప్పవచ్చు.

కాని జానకి అమలుపరుస్తానన్న ఫాషన్స్ తమ ఇంట్లో అస్సలు ఒప్పుకోరు. తనకేం? జానకి ఎలా వున్నా అందంగా వుంటుంది. ఎటువంటి గెటప్ అయినా తనకి నప్పుతుందికూడాను. ఆ 'దిలాసా' తోనే జానకికి అంత పట్టుదల.

అక్కడికీ తను చెప్పాడు. మార్కెట్‌లో రకరకాల విగ్స్ దొరుకుతాయి, నీక్కావలసినవన్నీ తెప్పిస్తాను. ఆ గెటప్‌లతో నీ ఆల్బమ్ తయారుచేసుకో!'' అని. జానకి వింటేనా?''

''మాట ఇచ్చారు తప్పకుండా నిలబెట్టుకోండి'' అంటుంది మొండిగా. గట్టిగా ఏమైనా అందామంటే కొత్త పెళ్లాం. కొత్త గుర్రం రెండూ ఒకటే! మచ్చిక చేసుకోవడంలో ఏమైనా తేడా వస్తే వైల్డ్‌గా తయారవుతాయి'' అని చెప్పిన ఫ్రెండ్ మాట గుర్తొచ్చి శాంతం వహిస్తున్నాడు శ్రీధర్.

ఇలా శ్రీధర్ భయపడుతున్న తరుణంలో జానకి నెలతప్పింది. ఆ విషయం అందరికీ ఆనందం కలిగించింది. ఒక్క జానకికి తప్ప.

ఇదంతా భర్త కుట్ర. అడగ్గానే కాదనకుండా అలాగే అని ఇప్పుడు ఇలా అడ్డుకల్పించాడు'' అనుకుంది కచ్చిగా. శ్రీధర్‌తో అలాగే పోట్లాడింది. చివరికి శ్రీధర్‌కి ఒళ్లు మండి ''ఇప్పుడయితేనేం? చేయించుకో గుండు'' అన్నాడు నొక్కి పలుకుతూ.

జానకికి ఏమనాలో తోచలేదు. అసలు తన ఈ కోరిక కోరుకుంది ఎందుకూ! తన ఫిజిక్ అన్నింటికీ సూట్ అవుతుంది. అందుకే తీర్చుకోవాలనుకుంది.

కాని, ఎత్తయిన కడుపు పెట్టుకుని ఏ ఫాషన్స్ అనుకరిస్తుంది? అనుకుని డెలివరీ అయ్యాక తన ఫాషన్స్ అమలుపరుస్తానంది జానకి. ''హమ్మయ్య'' అని కొంచెం తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీధర్. అసలే సాంప్రదాయాల కుటుంబాలు తమవి. కడుపుతో వున్నప్పుడు గుండు చేయించుకుంటే చేయించుకున్న జానకిని, ఒప్పుకున్నందుకు తనని దుమ్మెత్తిపోసేవారు. తాత్కాలికంగా ఈ ఆపద తప్పింది అనుకున్నాడు శ్రీధర్.

★ ★ ★

మానవులు ఆలోచిస్తే దేవుడు అమలుపరుస్తాడు అన్నట్లుగా జానకికి మూడవనెల వచ్చేసరికి ఓ వింత సమస్య మొదలైంది. అదేమిటంటే జానకికి రోజూ కాస్త కాస్త చొప్పున జుట్టు ఊడిపోవడం మొదలుపె


ట్టింది. అదికూడా కుచ్చులుకుచ్చులుగా, పాయలు పాయలుగా రోజుకి గుప్పెడు గుప్పెడు చొప్పున ఊడిపోసాగింది.

అది గమనించిన జానకి భయపడిపోయింది. ఆ జుట్టు ఊడినంతమేర గుండ్రంగా బట్టతలలా నున్నగా ఫ్రు కనిపిస్తోంది. సరిగ్గా వారానికల్లా పైనంతా ఖాళీ అయిపోయింది. పేను కొరుకుడేమో! అని భయపడి బృంగామలకతైలం మందారతైలం అన్నీ రుద్ది, లాభంలేక చివరికి డాక్టరుని సంప్రదించారు.

ఆయన పరీక్షలన్నీ చేశాక "చాలా తక్కువమందికి ఈ సమస్య ఎదురవుతుంది. కడుపుతో ఉన్నప్పుడు జుట్టంతా ఊడిపోయి డెలివరీ అయిన మూడో నెలనుంచి తిరిగి వస్తుంది. దీనికి మందులు లేవు" అని చెప్పాడు.

అది విన్న జానకి తట్టుకోలేకపోయింది. బెంగతో అన్నం, నీళ్లు మానేసింది. భర్త, అత్తగారు చివాట్లు పెట్టి ధైర్యం చెప్పారు. వారెంత చెప్పినా జానకికి దిగులు వచ్చేసింది. ఏమిటిది? నేనేం కోరుకుంది? చివరికి ఇలా జరగడమేమిటి? అద్దంలో చూసుకుంటే భయమేస్తోంది. బట్టతలలా నునుపుగా మెరిసే బుర్రమీద అక్కడక్కడ పుంజీడు పుంజీడు జుట్టు, వెనకాల ముచ్చిలిగుంటపైన సన్నగా ఎలకతోకలా పొడవుగా ఒక గుప్పెడు వెంట్రుకలు. ఇదేనా తన కేశ సంపద. తనకే ఇంత అసహ్యం వేస్తోందే! తన భర్తకి, మిగిలిన వారికి తనని చూసి ఇంకెంత అసహ్యం వేస్తుందో!" అని మనోవ్యాధి పెట్టేసుకుంది జానకి.

విషయం తెలిసి వచ్చిన జానకి తల్లి అనసూయ "జానకికి ధైర్యం చెప్పి, ఆపైన జానకిని తిట్టిపోసింది. అందుకే ఎప్పుడు మాట్లాడినా మంచి మాట్లాడాలి. ఎప్పుడూ గుండు చేయించుకుంటామ అని ఎగిరేదానివిగా. ఆ దేవుడే చేసిపారేశాడు. ఇకనుండైనా వెర్రిమొర్రి మాటలు మాట్లాడకు. ఆడదానికి అసలు అందం జుట్టు. అలాంటి అందమైన జుట్టు పోతేగాని దాని అందం తెలిసిరాలేదు నీకు" అని సన్నసన్నగా మందలించింది.




*"ఏమండీ! నామీద మీకు నిజంగా ప్రేమ లేదు. నేను చనిపోయిన మరునటి రోజే మళ్లీ పెళ్లి చేసుకునేలా వున్నారు".*

*"లేదు విజయా, కొన్ని రోజులు విశ్రాంతి తీసుకుంటాను".*

—ముద్దా రమణమూర్తి
(అనంతపురం)

తన శ్రీమంతం చేస్తానంటే ససేమిరా ఒప్పుకోలేదు జానకి.

చివరికి ఫోటోలు, వీడియో, ఏమీ వుండవని హామీ ఇచ్చి శ్రీమంతం జరిపారు జానకికి. ఆ మిగిలిన ఎలకతోకవంటి వెంట్రుకలకే సవరం పెట్టి జడవేసి పూలదండని చుట్టారు.

పైనంతా గుండు, వెనకాల పూలజడ, పట్టుచీరతో వింతగా కన్పించే జానకిని చూస్తే అందరికీ నవ్వొచ్చింది. కాని ఎవరూ నవ్వకుండా జాగ్రత్తపడ్డారు.

తన వాలకాన్నిబట్టి ఎక్కడికీ రానని జానకిని పట్టుబట్టి బయటకు తీసుకెళ్లేవాడు శ్రీధర్. జానకికోసం పెద్ద సిల్కు రుమాలు తెచ్చాడు. దాన్ని స్కార్ఫ్‌లాగా కట్టుకునేది జానకి.

సడెన్‌గా జానకిని చూసినవారెవరూ జానకిని గుర్తుపట్టేవారుకాదు. గుర్తుపట్టాక వివరాలు అడుగుతూనే సన్నసన్నగా నవ్వుతూ వుండేవారు. అదిచూసి ఉక్రోషంగా వుండేది జానకికి. దానికి సాయం జానకి చిన్నబావ అననే అన్నాడు.

"మీ ఆయన చాలా మంచివాడే జానకి. అదే నేనయితేనా! నిన్ను ఎప్పుడో వదిలేసేవాణ్ణి" అని అంటూన్న చిన్నబావని పీకనొక్కాలన్నంత కసి పుట్టుకొచ్చేది.

పూర్వం తన కోరిక తెల్సినవారందరూ "పోనీలే! నీకెలాగూ గుండు అంటే ఇష్టమేగా!" అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇవన్నీ వింటున్న జానకికి ఒకటే ఆలోచన! ఎప్పటికైనా తన జుట్టు తనకి వస్తుందా! భగవంతుడా నువ్విచ్చిన అందాన్ని గుర్తించక అలక్ష్యం చేయాలనుకున్నాను. నన్ను క్షమించు స్వామీ! అని దేవుడ్ని లోలోపల ప్రార్థించేది. పుట్టే వాళ్లకైనా జుట్టు వుంటుందా అని భయపడుతూ వుండేది.


జానకికి ఆడపిల్ల పుట్టింది. ఆ పిల్లకి నిగనిగలాడుతూ టోపీ పెట్టినట్లుగా నల్లని వుంగరాల జుట్టు. అదిచూసి కాస్త జానకి స్థిమితపడింది. డాక్టర్లు చెప్పినట్లుగా పాపకి మూడో నెల రాగానే వరిపంటకు మొలకలు వచ్చినట్లుగా జానికికి బట్టతల స్థానంలో నల్లని వెంట్రుకలతో నిండిపోయింది. అది చూసుకున్న జానకి భర్తని అమూప్, కేశవర్ధిని, రీటా వీటన్నింటిని తెమ్మని చెప్పింది. అదిచూసి శ్రీధర్ మనసులోనే నవ్వుకుని "ఎందుకు జానకీ! మొక్కు సమస్య లేకుండా గుండుగా కొన్నాళ్లు గడిపావు. ఇప్పుడు క్రాఫ్ వస్తుందిగా రానీ!" అన్నాడు తాపీగా చిన్నగా జానకి గుండు నిమురుతూ.


అది విన్న జానకి "చాల్లెండి మీ బడాయి! అందమైన జుట్టు ఉన్ననాడు దాని విలువ తెలీక ఏవేవో ఫాషన్స్ అమలుపరుద్దామనుకున్నాను. కానీ నా ప్రమేయం లేకుండా పోయిన నా తలకట్టు మళ్లీ నాకొస్తే చాలు అనిపిస్తోందిప్పుడు.

ఈ ఏడాదంతా నేను అనుభవించిన బాధ చాలు. ఇంకే ఫాషన్స్ అక్కర్లేదు. నా కోరిక ఇంత దారుణంగా తీరుతుందని మాత్రం ఊహించలేదు. అందరూ నన్ను వింత వింతగా చూడడం నన్ను చూసి నవ్వాపుకోలేక ఛావడం సానుభూతి వ్యక్తం చేయడం భరించలేక చచ్చాను. అయినా ఇప్పుడు నేను అనుకున్న ఫాషన్స్ అమలుచేశాననుకోండి. జుట్టు మొత్తం ఊడిపోయిందిగా పాపం! అంతకంటే మరేం చేస్తుంది?" అనుకుంటారు అలా నాకిష్టంలేదు" అని అంటున్న భార్య మాటలకి హమ్మయ్య అని తేలిగ్గా నిట్టూర్చాడు.

"దెబ్బకి అమ్మాయిగారి గుండు సరదా తీరిపోయింది" అనుకుని మనసులోనే నవ్వుకున్నాడు శ్రీధర్ భార్యామణి రాసిచ్చిన లిస్ట్ తీసుకుని బజారుకు బయలుదేరాడు.

*





## పాపం!

*'పెదరాయుడు' చిత్రం చూసినవారికి పాపం భానుప్రియ అనిపిస్తుంది. ఎంతో ప్రతిభ వున్న నటి ఎందుకిలా మరుగున పడింది అనే బాధ కలుగుతుంది. ముఖ్యంగా కొన్ని డ్రామా సన్నివేశాల్లో మోహన్‌బాబుతో పోటీ పడి నటించింది. నేటి పోటీకోసం డీ గ్లామరయిజ్డ్ పాత్రమకూడా వేయడం ఆమె ప్రతిభకు తార్కాణం నిజంగా భానుప్రియకు మంచి అవకాశాలు రావాలని కోరుకుందాం!*

—సాయిరాం

